వీఆర్‌కు పంపొద్దు.. ప్లీజ్..!

లూప్‌లైన్‌కైనా ఓకే.. వైసీపీతో అంటకాగిన ఖాకీల వేడుకోలు

- గత ఐదేళ్లలో ఏకపక్షంగా కేసులు
- ప్రతిపక్షాలను అణగదొక్కిన వైనం
- ప్రభుత్వం మారడంతో వణుకు
- పోస్టింగ్ కోసం టీడీపీ నాయకుల వద్ద బేరాలు

హిందూపురం, జూన్ 28: వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఖాకీలు రెచ్చిపోయారు. ఆ పార్టీ నాయకులు చెప్పిందే వేదం.. చేసిందే శాసనం అన్నట్లు వ్యవహరించారు. వారు ఏది చెబితే అది అడ్డదిడ్డంగా చేసేశారు. ఏకపక్షంగా వ్యవహరించి, ఆ పార్టీ నాయకులకు అన్నివిధాలుగా వెన్నుదన్నుగా నిలిచారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల ఫిర్యాదులు తీసుకోకుండా వారిపైనే ఎదురు కేసులు పెట్టారు. కొంతమంది పోలీసులైతే వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. పోలీసు వ్యవస్థపై ఉన్న గౌరవాన్ని మంటగలిపారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఏ చిన్న పోస్టు పెట్టినా, నిరసనలు తెలిపినా కేసులు పెట్టడం, గంటలు, రోజుల తరబడి స్టేషన్‌లో కూర్చోబెట్టడం, అప్పటికీ వారికి కసి తీరకపోతే అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా అరెస్టులు చేశారు. మరికొందరు పోలీసులు ఇంకో అడుగు ముందుకేసి.. వీడియో కాల్‌చేసి వైసీపీ నాయకులకు చూపించి పైశాచిక ఆనందం పొందారు. అందరి ముందు అగౌరవంగా మాట్లాడటం, ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని వ్యవహారాలు నడిపించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ ఖాకీల్లో భయం పట్టుకుంది. తాము చేసిన పనులకు చర్యలు తప్పవని నిర్ధయానికొచ్చారు. ఎక్కడ వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)కు పంపుతారోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. వీఆర్‌కు పంపొద్దనీ, లూప్‌లైన్‌కైనా పంపాలని టీడీపీ నాయకులను వేడుకుంటున్నారు.

ఏకపక్షంగా కేసులు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే హిందూపురం నియోజకవర్గంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైసీపీకి వ్యతిరేకంగా అప్పట్లో సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో జనసేన నాయకుడిపై తప్పుడు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మరో మండలంలో సోషల్ మీడియా వేదికగా వైసీపీ అరాచకాలను ప్రశ్నిస్తే స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సదరు టీడీపీ కార్యకర్తకు వీపువాచేలా కొట్టారు. హిందూపురం పట్టణంలో పలు సందర్భాల్లో టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. రోడ్డెక్కి నిరసన తెలపాలన్నా.. ప్రభుత్వాలు చేస్తున్న అరాచకాలు, ఆగడాలు, భూదందాలపై ప్రశ్నించినా.. వెంటనే కేసులు పెట్టారు, వారిని వేధించారు.



ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వాహనం ద్వారా అన్నదానం చేస్తున్నా.. దానిని కూడా జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు.. పోలీసులను ఉసిగొలిపారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందంటూ టీడీపీ నాయకులను అప్పట్లో ఓ సీఐ బెదిరించాడు. ఏకంగా అన్నం పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. అప్పట్లో ఈ ఘటన కలకలం రేపింది. హిందూపురం మండలం పూలకుంట సర్పంచ్ మంజునాథ్‌పై వైసీపీ హయాంలో సుమారు 20సార్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే సదరు సర్పంచ్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి, చితకబాదారు. 2021లో స్థానిక ఎన్నికల సందర్భంలో తెలుగుదేశం నాయకులపై పోలీసులు ఝులుం చూపించారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తూ వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలని ఇరుపార్టీల నాయకులు నిరసన తెలిపితే వారిపైనే కేసులు కట్టారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన ఓ యువ నాయకుడు.. టీడీపీ, జనసేన నాయకులపై అసభ్యకరంగా పోలీసు స్టేషన్‌లోనే మాట్లాడాడు. అయినా పోలీసులు మిన్నకుండిపోయారు. చంద్రబాబు అక్రమ అరెస్టు అనంతరం టీడీపీ నాయకులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేస్తుంటే వారిపైనే కేసులు కట్టారు. జగన్ దిష్టిబొమ్మ దహనం చేస్తామంటే కేసులు పెట్టారు. అదే సమయంలో చంద్రబాబు, బాలకృష్ణ చిత్రపటాలను కిందకేసి తొక్కినా.. చెప్పుల హారాలు వేసినా.. దిష్టిబొమ్మలను కాల్చినా పోలీసులు అటువైపు చూడకపోవడం శోచనీయం. ఏకపక్షంగా కేసులు కట్టి ప్రతిపక్షాల గొంతు నొక్కారు. శాంతియుతంగా నిరసన తెలుపుతామంటే హౌస్ అరెస్టులు, స్టేషన్‌కు తరలించడం వంటివి చేసి ప్రజావాణి వినిపించకుండా అణగదొక్కారు. వైసీపీ పాలనలో సెబ్ అధికారులు, పోలీసులపై వైసీపీ నాయకులు తిరగబడి దాడిచేసినా రాజీ అయ్యారు తప్ప.. వారిపై కేసులు పెట్టకపోవడం విశేషం.

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వణుకు..

కూటమి అధికారంలోకి రావడంతో గత ఐదేళ్లుగా వైసీపీ కార్యకర్తలుగా పనిచేసిన కొంతమంది పోలీసుల్లో వణుకు మొదలైంది. ప్రతిపక్షాలపై లెక్కలేనన్ని సార్లు జులుం ప్రదర్శించడం, వైసీపీ నాయకులకు అనుచరుల్లా వ్యవహరించడం, రాజీలు చేయించడం ఇవన్నీ వారిని తీవ్ర ఆందోళనలోని నెడుతున్నాయి. గత వైసీపీ పాలనలో హిందూపురం నియోజకవర్గంలో గంజాయి వ్యాపారం జోరుగా సాగిందన్నది బహిరంగ రహస్యమే. గంజాయి విక్రేతలను కొంతమంది సిబ్బంది వెనకేసుకు తిరిగారు. పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకుని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేవారికి అండగా నిలిచారు. భూపంచాయితీల్లో తలదూర్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వారిలో ఆందోళన మొదలైంది. టీడీపీ నాయకులు తమను ఎక్కడ బయటకు పంపుతారోనన్న భయం పట్టుకుంది. మరికొంత మంది పోలీసు అధికారులైతే గతంలో చేసిన తప్పిదాలు ఇప్పుడు ఎక్కడ బయటకు లాగుతారోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. వాటిని తోడితే తమ పరిస్థితి ఏంటని దిగులు చెందుతున్నారు. కొంతమంది సిబ్బంది వైసీపీ నాయకులను వెంటేసుకుని తిరగడమేకాక ప్రచారంలో కూడా పాల్గొన్నారు. అలాంటివారు పోస్టింగ్ కోసం టీడీపీ నాయకుల వద్దకు ప్రస్తుతం కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

లూప్‌లైన్‌కు పంపినా ఓకే

గత ఐదేళ్లా వైసీపీతో అంటకాగిన పోలీసులు ప్రస్తుతం తెలుగుదేశం నాయకుల వద్దకెళ్లి తమను వీఆర్‌కు పంపవద్దని వేడుకుంటున్నట్లు తెలిసింది. లూప్‌లైన్‌కైనా పంపితే బాగుంటుందని కోరుతున్నారట. వీఆర్‌కు వెళ్తే జీతం ఆగిపోతుంది. లూప్‌లైన్‌కు పంపితే వెళ్లిపోతామంటూ కొంతమంది విన్నవించుకుంటున్నారు. హిందూపురం నియోజకవర్గంలో గత ఐదేళ్లలో కొంతమంది పోలీసులు వ్యవహరించిన తీరును గమనిస్తే వారు చేసిన తప్పిదాలను వెలికితీస్తే ప్రస్తుతం వారిని వీఆర్‌కు పంపకుండా ఆపరు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పర్యటనకు వచ్చినపుడు ఆయనకు ఓ ఏఎస్ఐ నమస్కారం చేశారని ఆయనను నానా ఇబ్బందులు పెట్టారు.



ఆయనను కదిరి ప్రాంతానికి బదిలీ చేయించి కొంతమంది వైసీపీ నాయకులు, పోలీసులు పైశాచిక ఆనందం పొందారు. వైసీపీకి అనుకూలంగా మరీ అరాచకంగా వ్యవహరించిన పోలీసులను వీఆర్‌కు పంపకుండా ఆపలేరు. ఈ పరిస్థితుల్లో పోలీసు అధికారులతోపాటు సిబ్బంది వీఆర్ వద్దని లూప్‌లైన్‌కు పంపాలని ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే టీడీపీ నాయకుల వద్ద రాయబారాలు నడుపుతున్నారు. ఏది ఏమైనా వైసీపీతో అంటకాగిన ఖాకీల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఎక్కడలేని భయం, ఆందోళన పట్టుకుంది.

వాహనాల అద్దె బిల్లులు వెంటనే

చెల్లించాలి

డ్రైవర్ల డిమాండ్.. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న డ్రైవర్లు

మడకశిర రూరల్, జూన్ 28: ఎన్నిల సమయంలో అద్దెకు తీసుకున్న వాహనాలకు సంబంధించిన అద్దె బిల్లులను వెంటనే చెల్లించాలని డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. బిల్లులు చెల్లించకుండా అధికారులు నిధులు డ్రా చేసుకుని, స్వాహా చేయడంపై 'అప్పనంగా దోచేశారు..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం కథనాన్ని ప్రచురించింది. దీంతో డ్రైవర్లు వాహనాల అద్దె బిల్లులు చెల్లించాలంటూ ధర్నా చేపట్టారు. డ్రైవర్ల సంఘం నేత సంజీవ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అద్దెకు తీసుకున్న వాహనాలకు ఇతర నియోజకవర్గాల్లో ఇప్పటికే బిల్లులు చెల్లించారన్నారు. మడకశిరలో మాత్రం రెండు నెలలు కావస్తున్నా ఇవ్వలేదన్నారు. బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తహసీల్దారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. డీటీ మాట్లాడుతూ.. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీంతో డ్రైవర్లు శాంతించి వెళ్లిపోయారు.

ఫైళ్లు.. ఇంటికి..!

పైసలిస్తేనే బయటకు..
కదిరి మున్సిపాలిటీలో చోద్యం.. యథేచ్ఛగా వసూళ్ల పర్వం



కదిరి మున్సిపల్ కార్యాలయం



కదిరి, జూన్ 28: మున్సిపాలిటీలో వసూళ్లపర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. పైసలివ్వందే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఫైళ్లన్నీ చైర్‌పర్సన్ నజీమున్నీషా ఇంటికి చేర్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైసలందితే ఒక్కొక్కటిగా బయటకు వస్తాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసలివ్వకుంటే అవి ఎన్నిరోజులైనా బీరువాలో మూలగాల్సిందేనట. పట్టణాభివృద్ధిని సైతం గాలికొదిలేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కాసులిస్తేనే..



మున్సిపాలిటీలో ఫైల్ కదలాలంటే కాసులు ఇచ్చుకోవాల్సిందేనన్న చర్చలు సాగుతున్నాయి. 2022లో ఓ కాంట్రాక్టర్ మున్సిపాలిటీలో శానిటరీ పనులు చేశాడు. దానికి సంబంధించి రూ.16 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉంది. నేటికీ ఇవ్వలేదు. కాంట్రాక్టర్ బిల్లు అడిగితే రూ.3 లక్షలు ఇస్తేనే చేస్తామని మున్సిపల్ పాలకులు చెప్పినట్లు సమాచారం. మున్సిపాలిటీలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వాటికి సంబంధించిన 47 ఫైళ్లను చైర్‌పర్సన్ తన వద్దే ఉంచుకున్నట్లు సమాచారం. ఆమె ఇంట్లో పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఫైళ్లను అధికారులు అడిగినా పట్టించుకోలేదని పురపాలిక వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరినా మున్సిపల్ చైర్‌పర్సన్ తీరు మాత్రం మారలేదన్నది బహిరంగ విమర్శం. ఫైళ్లను ఇంట్లోనే ఉంచుకున్నట్లు తెలుస్తోంది. పురపాలిక ఉన్నతాధికారి తీవ్ర ఒత్తిడి తేవడంతో వాటిని రెండ్రోజుల క్రితం సంబంధిత అధికారులకు పంపినట్లు సమాచారం. తాను చెప్పేవరకు బిల్లులు చేయకూడదని హుకుం జారీచేసినట్లు ఆ విభాగంలో చర్చ సాగుతోంది.

వైసీపీతో అంటకాగిన ఉద్యోగులకు అండ



ఎన్నికల సమయంలో వైసీపీతో అంటకాగిన ఉద్యోగులకు చైర్‌పర్సన్ నజీమున్నీషా అండగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో వైసీపీ నాయకులతో ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఉన్నట్లు ఈసీ గుర్తించి, సస్పెండ్ చేసింది. ఆ ఉద్యోగిని అప్పుడే విధుల్లోకి తీసుకున్నట్లు జీతం చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన ఓ ఆఫీస్ సబార్డినేట్‌ను పాలకులు వెనకేసుకొస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలోని ఓ మంత్రి వద్ద ఫొటోలు దిగి వాటిని ఓ అధికారికి పంపి, తనకు మంత్రి అండ ఉన్నట్లు బెదిరిస్తున్నట్లు సమాచారం.

కౌన్సిల్ భేటీ నిర్వహణపై నిర్లక్ష్యం

పట్టణాభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ భేటీ కీలకం. సమావేశంలో అభివృద్ధి పనుల ఎజెండాకు ఆమోదం తెలుపుతారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ 6వ తేది వరకు ఎన్నికల కోడ్ కారణంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. ఆ తరువాత వెంటనే నిర్వహించే అవకాశం ఉంది. కౌన్సిల్ భేటీలో చర్చించాల్సిన ఎజెండాను అధికారులు రూపొందించి, పంపారు. అయినా.. ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. దీనిపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు జూలై 1న సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. జూన్‌లో అవకాశం ఉన్నా.. నిర్వహించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా.. పట్టణాభివృద్ధిని అటకెక్కించి.. అక్రమాల పర్వం సాగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పండుటాకులకు పండుగ

పెరిగిన పింఛన్ మొత్తం
అవ్వాతాతల ఆనందం
2.73 లక్షల మందికి లబ్ధి

పుట్టపర్తి, జూన్ 28: పండుటాకులు, ఏ ఆసరాలేని వారిలో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది. వారి మోములో చిరునవ్వులు చిందించేలా చేసింది. పింఛన్ మొత్తాన్ని పెంచి, వారికి నిజమైన పండుగను తెచ్చిపెట్టింది. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పింఛన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చారు. అది కూడా ఈ ఏడాది ఏప్రిల్ నుంచే అందజేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. చంద్రబాబు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే పండుటాకులకు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు పూనుకున్నారు. రూ.3 వేలు ఉన్న పింఛన్ మొత్తాన్ని 33 శాతంపెంచి రూ.4 వేలు చేశారు. ఇచ్చిన మేరకు ఏప్రిల్ నుంచి రూ.వెయ్యి చొప్పున కలుపుకుని మొత్తం రూ.7 వేలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. 1వ తేదీనే పింఛన్ పంపిణీని పూర్తి చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

ఫించన్‌దారులు 2,73,015 మంది..

జిల్లావ్యాప్తంగా 2,73,015 మంది పింఛన్‌దారులున్నారు. వీరిలో 34,091 మంది దివ్యాంగులకు పింఛన్ మొత్తం రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, 1757 మంది బెడ్‌పేషెంట్లకు రూ5వేల నుంచి రూ15 వేలకు, 105 మంది దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పింఛన్ పెంచారు. వైసీపీ హయాంలో ప్రతినెలా పింఛన్ల కింద జిల్లాకు రూ.81.47 కోట్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పెంచిన పింఛన్‌తో కలిపి జిల్లాకు రూ.116.82 కోట్లు కేటాయించనున్నారనను. ఈ లెక్కన ప్రభుత్వంపై రూ.35కోట్లుపైగా పింఛన్ల భారం పడనుంది.

ఏప్రిల్ నుంచే అమలు

కూటమి గెలిస్తే ఏప్రిల్ నుంచే పెంచిన పింఛన్ రూ.4వేలు చొప్పున అందిస్తామంటూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. దానిని అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అమలు చేస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలు కలిపి మొత్తం రూ.69 కోట్లు అదనంగా పింఛన్లకు కేటాయించనున్నారు. రూ.3 వేల నుంచి రూ.4వేలు పింఛన్ పొందేవారి సంఖ్య 2.30 లక్షలు. వీరికి 1న రూ.4వేలు పింఛన్‌తోపాటు రూ.మూడు వేలు కలిపి ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.7వేలు ఇస్తారన్నమాట.

వృద్ధులకు పెద్దకొడుకయ్యాడు



ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3 వేలు ఉన్న పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు ఒకేసారి పెంచారు. తద్వారా తమలాంటి వారికి పెద్దకొడుకుగా భరోసా ఇచ్చారు. ప్రస్తుతం అన్నింటి ధరలు పెరిగాయి. పింఛన్ సొమ్ము పెరగడంతో ఎంతో ఊరట లభించింది.

\- భూమిగాని రామప్ప, గోకులం, పుట్టపర్తి

కొండంత అండ



ట్రాక్టర్ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని మంచానపడ్డాను. నాకు వస్తున్న రూ.5 వేల పింఛన్ మొత్తాన్ని చంద్రబాబు ఏకంగా రూ.15వేలకు పెంచి, కొండంత అండనిచ్చారు. మంచం దిగి నడవలేని నాలాంటి దివ్యాంగుల జీవితాల్లో భరోసా నింపారు.

\- చాకలి నాగరాజు, ఎనుమలపల్లి

కంది సాగుతో అధికాదాయం

పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ జాన్సన్



కందిపంట

పుట్టపర్తి రూరల్, జూన్ 28: కందిపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధికాదాయం పొందవచ్చని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ జాన్సన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో సాగుచేసే కందిపంట బెట్టను తట్టుకుంటుందన్నారు. కంది మొక్క వేరు భూమిలోకి లోతుగా చొచ్చుకెళ్లి పోషకాలు, నీటితేమ శాతాన్ని గ్రహించి అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పంట పూర్తయిన తర్వాత కూడా కంది ఆకులు భూమిపై రాలి కుళ్లిపోయి భూమి సారవంతం అవుతుందన్నారు. కంది సాళ్ల మధ్య 120 నుంచి 150 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. మొక్కమొక్కకు 20 సెంటీమీటర్ల దూరం పాటించాలన్నారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 125 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ వేసి విత్తనం వేయాలన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎల్ఆర్‌జీ 52, టీఆర్‌జీ 58, ఎల్ఆర్‌జీ 105 విత్తన రకాలను ఎంచుకోవచ్చన్నారు. పీఆర్‌జీ 176 రకం సాగుకు అనుకూలమని సూచించారు. అంతర పంటలుగా వేరుశనగ, ఆముదం, పత్తి, కొర్ర, సజ్జ వేసుకోవచ్చన్నారు. నెలరోజుల తర్వాత దగ్గర దగ్గర ఉన్న మొక్కలను తీసివేయాలన్నారు. పూత రాకమునుపే 5 లీటర్ల వేపనూనె లీటర్‌నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెర్రి తెగులు సోకితే ముందుజాగ్రత్తగా 60 రోజులకు, 90రోజులకు గంధకం మూడు గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని ఆయన వివరించారు.

సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం

పుట్టపర్తి, జూన్ 28: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 47 సహకార సంఘాలకు నూతనంగా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించామన్నారు. గతంలో 7 సంఘాలకు ప్రభుత్వమే నియమించిందన్నారు. నూతనంగా నియమించిన వారు శుక్రవారం బాధ్యతలు చేపట్టారన్నారు. ఆరు నెలల పాటు వీరు కొనసాగుతారని ఆయన వెల్లడించారు.

THE ANANTAPUR DISTRICT COOPERATIVE CENTRAL BANK LTD., ANANTAPUR.

BALANCE SHEET

Amount in Rupees

Description	Sch	As on 31-03-2024 (Current Year)	As on 31-03-2023 (Previous Year)
Capital and Lilibilities			
Capital	1	1,21,62,11,065.40	1,14,72,26,068.87
Reserves and Surplus	2	1,29,57,36,294.37	1,28,75,96,824.91
Deposits	3	5,24,04,01,345.25	5,13,71,09,955.66
Borrowings	4	10,38,62,55,231.80	8,25,53,16,678.80
Other Liabilities and Provisions	5	1,53,98,80,701.32	1,39,14,87,004.05
Total		**19,67,84,84,638.14**	**17,21,87,36,532.29**
Assets			
Cash and balances with Reserve Bank of India	6	10,46,99,969.00	11,49,30,122.00
Balance with banks and money at call and short notice	7	2,55,99,82,446.02	2,70,02,90,731.90
Investments	8	1,72,50,53,899.27	1,71,78,83,322.04
Advances	9	13,65,47,94,552.40	11,05,16,84,317.44
Fixed Assets	10	1,22,95,50,306.35	1,23,77,37,451.39
Other Assets	11	40,44,03,465.10	39,62,10,587.52
Total		**19,67,84,84,638.14**	**17,21,87,36,532.29**
Contingent Liabilities	12	4,83,06,438.00	67,20,454.20

* Significant Accounting Policies & Notes to Accounting annexed
* The scheduled referred to above from an Integrappart of the Balance Sheet, asper our attached report of even date.
Note : Previous Year figures are regroups/reclassified where ever necessary to suit current year layout.

PROFIT & LOSS

Amount in Rupees

Description	Sch	As on 31-03-2024 (Current Year)	As on 31-03-2023 (Previous Year)
Income			
Interest earned	13	1,23,36,51,339.40	77,44,17,578.10
Other income	14	2,55,50,840.40	16,82,02,720.60
Total		**1,25,92,02,179.80**	**94,26,20,298.70**
Expenditure			
Interest expended	15	92,12,80,963.02	64,05,54,524.70
Operating expenses Provisions and contingencies	16	32,60,61,684.96	29,16,40,293.59
Total		**1,24,73,42,647.98**	**93,21,94,818.29**
Profit / Loss		**1,18,59,531.82**	**1,04,25,480.41**
Net profit / loss (-) for the year After Tax			
"Profit / loss (-) brought forward"			
Total		**1,18,59,531.82**	**1,04,25,480.41**
Appropriations			
Reserve Fund			
Dividend Equilisation Fund			
Investment Fluxation fund			
Agrl., Stabilisation Fund			
Education Fund			
Building Fund			
UDP		1,18,59,531.82	1,04,25,480.41

Date: 29-05-2024
Place : Anantapur.

NOTES ON ACCOUNTS

i) SLR Investment Permanent = Gsec - Rs 12600.72 lakhs
ii) Non SLR Investments - Rs 4549.82 lakhs
iii) No loans had been issued to Directors
iv) No Bank Gurantees as on 31-03-2024
v) Average Cost of Deposits - 5.82
vi) NPAs a) Gross NPAs - Rs 10712.60 Lakhs (7.85%)
b) Net NPA - Rs 4761.19 Lakhs (3.65%)
vii) Provision for NPAs - 4440.23 Lakhs
viii) Provision for Standard Assets - 389.62 Lakhs
ix) Insurance premium to DICGC had been paid - 60.35 Lakhs

For AM Reddy & DR Reddy Chartered Accounts
FRN: 009068S
Sd/- **CA R.Rama Ravisankar Reddy** M.No.217160

For The Anantapur District Cooperative Central Bank Ltd.,
Sd/- **K.Surekha Rani** CEO (FAC)

Note : Financial Statememts are yet to be adopted by General Body of the Bank

భారీగా పడిపోయిన చీనీ ధరలు

● ఒక్కరోజులోనే టన్నుపై రూ.10వేలకుపైగా..

అనంతపురం రూరల్, జూన్ 28: మార్కెట్‌లో చీనీ ధరలు భారీగా పడిపోయాయి. ఒక్కరోజులోనే టన్నుపై రూ.10వేలు తగ్గింది. శుక్రవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో గరిష్ఠంగా టన్ను రూ.18వేలతో అమ్ముడుపోయాయి. అదే గురువారం టన్ను రూ.27వేలు పలికాయి. సరాసరి ధరల్లో కాస్త వ్యత్యాసం ఉండింది. సరాసరి ధర రూ.12వేలు, కనిష్ఠ ధర రూ.8వేలతో అమ్ముడుపోయాయి. చీనీ ఉత్పత్తుల ఎగుమతి ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురవడమే ధరల తగ్గుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఢిల్లీ, బెనారస్, కోల్‌కత్తా, జైపూర్ ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా ధరలు పడిపోయాయని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లిన చీనీ కాయలు వర్షాల కారణంగా నిలిచిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

2, 3 తేదీల్లో గురుకుల ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 28: మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు జూలై 2,3 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సంగీతకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. 63 సీట్లకు మొత్తం 1301 మంది దరఖాస్తు చేసుకోగా... 957 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షల ఫలితాలు, మెరిట్ జాబితాను అన్ని గురుకుల పాఠశాలల్లోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఫలితాల కోసం mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. జూలై 2న బాలురకు, 3న బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌లో మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామన్నారు.

పది సప్లిమెంటరీలో 32 మంది పాస్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్28: జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో వసతి పొందుతున్న 10వ తరగతి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో 32 మంది పాస్ అయినట్లు ఆ శాఖ జేడీ మధుసూదన్‌రావ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మొత్తం 38 మంది విద్యార్థులు పరీక్ష రాయగా... 32 మంది పాసవ్వగా... ఆరుగురు ఫెయిల్ అయినట్లు తెలిపారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 1వరకు గడువు

అనంతపురం విద్య, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు సంబంధించి జూలై 1వ తేదీ ఆఖరి గడువని డీఈఓ వరలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా దరఖాస్తు చేయడంతోపాటు, ఫీజు చెల్లించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం సీఎఫ్ఎంఎస్, సిటిజన్ చార్టర్ ద్వారా ఫీజు చెల్లింపు చేయవద్దని, అలాంటివి ఆమోదించరని ప్రతి విద్యార్థి గమనించాలని సూచించారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదుల కోసం కమిటీలు

అనంతపురం విద్య, జూన్ 28 : పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎదుర్కొనే బాధితుల కోసం... అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, దిద్దుబాటు చట్టం-2013 అమలులో భాగంగా అన్ని మండలాల తహసీల్దార్లను నోడల్ ఆఫీసర్లుగా జిల్లా కలెక్టర్ నియమించారన్నారు. 10 మంది కంటే ఎక్కువ రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఇతర వర్గాల ఉద్యోగులు పనిచేసే అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో, కర్మాగారాల్లో, స్వయం ఉపాధి ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. లైంగికంగా వేధింపులు ఎదుర్కొన్న మహిళలు నోడల్ ఆఫీసర్లుగా నియమితులైన తహసీల్దార్ల వద్ద ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. తహసీల్దార్లు సంబంధిత ఫిర్యాదులను స్థానిక లేదా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ద్వారా చర్యలు తీసుకునే ఆదేశాలిస్తారని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం,జూన్ 28: ఉమ్మడి జిల్లాల పరిధిలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి, ఇన్‌చార్జ్ జిల్లా న్యాయాధికారి సత్యవాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక హోదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ టాక్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తారని తెలిపారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

వసతిగృహాల మరమ్మతులకు నిధుల విడుదల

ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్28: జిల్లాలో ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు, ఒక గురుకుల పాఠశాల మరమ్మతుల కోసం రూ. 1.35 కోట్లు నిధులు విడుదల చేసినట్లు జేడీ మధుసూదన్‌రావు శుక్రవారం ప్రకటించారు. ఈనెల 19న 'సంక్షేమం తిరిగొచ్చేనా'..? అని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై జేడీ స్పందించారు. జిల్లా కలెక్టర్, జేసీ, జడ్పీ సీఈఓలు ఎంపీడీఓలు, తహసీల్దార్లతో తనిఖీలు చేయించిన అనంతరం జిల్లాలో అత్యంత శిథిలావస్థకు చేరుకున్న 10 సంక్షేమ వసతిగృహాలు, ఒక అంబేడ్కర్ గురుకులాన్ని మరమ్మతులకు ఎంపిక చేసినట్లు జేడీ తెలిపారు. ఇందుకోసం 10 హాస్టళ్ల మరమ్మతులకు రూ. 1.12 కోట్లు, కురుగుంట అంబేడ్కర్ గురుకులానికి రూ. 23 లక్షల చొప్పున మొత్తం రూ. 1.35 కోట్లు విడుదల చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఏపీ విద్యాసంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఏఈని ఆదేశించినట్లు జేడీ తెలిపారు.

ఉద్యోగాలకు ఊతం

అనంతపురం సెంట్రల్, జూన్ 28: నూతన ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే ఉద్యోగ కల్పన ప్రక్రియ వేగం పుంజుకుంది. జిల్లా ఉపాధి కల్పన, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండు వారాల్లోనే వరుస ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం ఐటీఐ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు దాదాపు 600మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఏకంగా 160మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. అదేవిధంగా 13న నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 95మంది విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. వీటితోపాటు ఉపాధి కల్పన కార్యాలయంలో తాజాగా నిర్వహించి ఇంటర్వ్యూల్లో దాదాపు 250మందికి ఉద్యోగాలు కల్పించామని ఉపాధికల్పనాధికారి కళ్యాణి పేర్కొన్నారు.

యువకుడి దారుణ హత్య

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 28: మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట సమీపంలో కొండ వద్ద వన్నూరుస్వామి(30) అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని అటుగా వెళ్లిన పశువుల కాపరులు శుక్రవారం గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ హరినాథ్ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో మద్యం సేవించిన అనంతరం ఈ హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్యకు కారణాలు ఏమిటో తెలుసుకునేందుకు భిన్నమైన కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వన్నూరుస్వామికి భార్య శ్రీవాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. శ్రీవాణి ఆర్డీటీ ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వన్నూరు స్వామి (ఫైల్)



రక్తపు మడుగులో వన్నూరుస్వామి

ఐదేళ్లలో ఏం చేశారో.. లెక్కలు తీయండి..

● తోపుదుర్తి డెయిరీపై వివరాలు ఇవ్వండి ● ఉమ్మడి జిల్లా పీడీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

అనంతపురం అర్బన్, జూన్ 28: ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో అమలైన పథకాలు, రుణాలు తదితర వివరాలన్నీ వెలికి తీయాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో అనంతపురం, సత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ పీడీలు, ఏపీఎంలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన మేరకు జూలై 1వతేదీన ఇంటి వద్దనే పింఛన్‌దారులకు పింఛన్ల సొమ్మును పంపిణీ చేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన వివరాలు అందజేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం ఏవిధంగా ముందుకు వెళ్లాలన్న అంశంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. అందరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తోపుదుర్తి సహకార డెయిరీ స్థితిగతులపై ఆరా తీశారు. అందులో ఎంత మంది మహిళలు పెట్టుబడి పెట్టారు..? ఇప్పటి దాకా వారికి ఎలాంటి లబ్ధి చేకూరింది, అంశాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు.



డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 28: ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఉష్ణోగ్రతలు 33.6-34.8 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు. గాలులు గంటకు 6 కి.మీ వేగతంతో వీచే అవకాశం ఉందన్నారు.

అంతర సేద్యం చేసుకోవాలి: శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

ఉమ్మడి జిల్లాలో జూన్ మొదటి వారంలో సాగు చేసిన వేరుశనగ పంట శాఖీయ దశలో ఉంది. రైతులు అంతర సేద్యం చేసుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు రసం పీల్చే పురుగులు ఆశించడానికి అనుకూలమన్నారు. నివారణకు వేరుశనగ పొలంలో ఎకరాకు పది జిగట అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఫెరోమోన్ ట్రాప్స్ ఎకరాకు నాలుగు అమర్చుకోవాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి ఇమిడా క్లోప్రిడ్ 17.8ఎస్ఎల్ 10.3 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

అంతరపంటగా రాగితో పాటు కందిని 8:2 నిష్పత్తిలో చిక్కుడును 8:1 నిష్పత్తిలో వేసుకోవాలన్నారు. రైతులు కూరగాయలను నాటే ముందు లీటరు నీటికి క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ, కార్బండిజమ్ 3గ్రాములు కలిపి మందు ద్రావణంలో వేర్లు ముంచిన తరువాత నాట్లు వేసుకోవాలన్నారు.

న్యాయవాదిపై దాడి

● హిజ్రాలతో పూలమాల వేయించి హేళన

● పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాదుల సంఘం

కదిరి లీగల్, జూన్ 28: పట్టణంలోని కోర్టు ఎదుట నివాసముంటున్న న్యాయవాది రామస్వామిపై శుక్రవారం దాడి జరిగింది. బాధితుడు న్యాయవాదుల సంఘానికి విషయం తెలియజేసి, వారి సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు, మరో న్యాయవాది వరప్రసాద్ కలిసి తన క్లయింట్‌లతో రామస్వామి మాట్లాడుతున్నారు. ఆ సమయంలో సైదాపురానికి చెందిన పొలినేని శ్రీనివాసులు, రాగిరి జయరాం, గంగాధర్, నాగప్ప, అనిల్, ఫక్కీరప్ప వారి ఇంట్లోకి ప్రవేశించారు. ఓ అగ్రిమెంట్ డబ్బుల కేసు విషయంలో రామస్వామితో వాదనకు దిగారు. జూలై 4న వాయిదా ఉందని, సెటిల్ అవుతుందని ఆయన సమాధానం చెప్పేలోగా పొలినేని శ్రీనివాసులు న్యాయవాది రామస్వామిపై దాడి చేశారు. జయరాం కూడా దాడి చేశారు. బండబూతులు తిడుతూ బీభత్సం సృష్టించారు. వారితో పాటు వచ్చిన హిజ్రాలు న్యాయవాది కూర్చీ లాక్కుని కూర్చున్నారు. న్యాయవాది మెడలో పూలమాల వేసి అవహేళన చేశారు. దీంతో న్యాయవాది భార్య, పిల్లలు భయాందోళనకు గురయ్యారు. మరో న్యాయవాది వరప్రసాద్ నచ్చచెప్పే ప్రయత్నం చేయగా.. అతనిపైనా దాడి చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకునేలోపు అందరూ పారిపోయారు. అనంతరం న్యాయవాదులిద్దరూ న్యాయవాదుల సంఘానికి జరిగిన విషయం తెలిపారు. అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రెండురోజులు కోర్టు విధులు బహిష్కరించాలని తీర్మానం చేశారు. అనంతరం సీఐ పుల్లయ్యను కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. కేసు నమోదు చేసుకుని నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు.



సంఘం కార్యాలయంలో దాడి గురించి వివరిస్తున్న న్యాయవాది రామస్వామి

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ కేతన్‌గార్గ్ బాధ్యతల స్వీకరణ



జేసీ కేతన్‌గార్గ్‌ను అభినందిస్తున్న డీసీఓ, సీఈఓ, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఉన్న ఏడీసీసీ బ్యాంకు పాలకవర్గకమిటీ రాజీనామాతో రాష్ట్ర ప్రభుత్వంలో సొసైటీలు, డీసీఎంఎస్‌లతో పాటు ఏడీసీసీ బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. డీసీఓ అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి పర్సన్ ఇన్‌చార్జిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, ఇదివరకు చోటు చేసుకున్న పరిణామాలపై జేసీ అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా పనిచేసి బ్యాంకును అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు డీజీఎంలు ఏబీ రాంప్రసాద్, సుఖదేవబాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రచారం చేసిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీకి టీడీపీ నాయకుల ఫిర్యాదు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: వైసీపీ తొత్తులుగా పనిచేసి, ఎన్నికల్లో ప్రచారం చేసిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని యాడికి మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రమ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలో పీడీ ఈశ్వరయ్యను కలిసిన ఆయన ఆధారాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. యాడికి మండలంలో పెద్దపేటగ్రామ శివశక్తి గ్రామైఖ్య సంఘం యానిమేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసిందన్నారు. వైసీపీ నేతలకు సుమారు 7డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రూ.1.2కోట్లకు పైగా నిధులను దోచిపెట్టిందని ఫిర్యాదు చేశారు. వైసీపీకి ఊడిగం చేయడంతో పాటు మహిళ సొమ్మును మెక్కిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పీడీ స్పందిస్తూ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పీడీ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకుడు రుద్రమనాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

బాధ్యతలు చేపట్టిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, జూన్ 28: జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ప్రొఫెసర్ శశిధర్ రిజిస్ట్రార్‌గా రాజీనామా చేయడంతో తాత్కాలికంగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ నియమితులయ్యారు. దీంతో శశిధర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది సత్యనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఎస్కేయూ వీసీ బంగ్లా ఖాళీ...

ఎస్కేయూ వీసీగా హుస్సేన్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన వీసీ అధికారిక భవనాన్ని ఖాళీచేసి వెళ్లారు. దీంతో వర్సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి బంగ్లాకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వ్యక్తిగత వినియోగానికి సంబంధించిన లావాదేవీలను క్లియర్ చేశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జేఎన్‌టీయూ వీసీగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు రాజీనామా చేసినా శుక్రవారం అధికారిక భవనంలో వున్నారు. ఆయన రాజీనామా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నుంచి ఆమోదం పొందేవరకు ఇక్కడే ఉండనున్నారు. అదేవిధంగా విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కావడంతో సర్దుబాటుకు సమయం పడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నిర్వహణకు నీళ్లొదిలారు..!

● సచివాలయాల పరిస్థితి దయనీయం

● నెలకు రూ.5వేల పైగా ఖర్చు



ముత్యాలచెరువు సచివాలయం

కదిరి అర్బన్, జూన్ 28: ప్రజలకు సేవలు మరింత చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని గొప్పగా చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. వాటి నిర్వాహణను మాత్రం గాలికొదిలేశారు. ప్రారంభంలో ప్రతి సచివాలయానికి కుర్చీలు, కంప్యూటర్లు, బల్లలు, స్టేషనరీ, ఇతర సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. కొన్ని రోజులకే స్టేషనరీ సరఫరా ఆపేసింది. అప్పటినుంచి సచివాలయాల భారం పంచాయతీపై పడింది. అసలే ప్రభుత్వం నుంచి నిధులురాక సతమతమవుతున్న పంచాయతీలకు సచివాలయాల నిర్వహణ భారంగా మారింది.

నెలకు రూ.5 వేల పైమాటే..

సచివాలయాలు ప్రారంభించాక సకాలంలో స్టేషనరీ సరఫరా చేయకపోవడంతో వాటికోసం పంచాయతీ నిధులపై ఆధారపడ్డారు. ప్రారంభంలో నెలకు రూ.5వేలు నిర్వహణ ఖర్చుల కింద జమ చేస్తామన్నారు. ఆరు నెలల తరువాత అప్పటి వైసీపీ పాలకులు మాట మార్చారు. ప్రభుత్వమే స్టేషనరీ సరఫరా చేస్తుందనీ, దీంతో నెలకు రూ.రెండువేలు చొప్పున సచివాలయాల నిర్వహణకు మంజూరు చేస్తామని 2022లో చెప్పారు. తరువాత ఆ రూ.2 వేలు ఊసేలేదు. అవసరమైన సామగ్రి, ప్రింటర్లు, ఇంటర్నెట్, విద్యుత్ బిల్లులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రింట్లు, ఇలా నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వినియోగాన్ని బట్టి ఒక్కో సచివాలయంలో రూ.5 వేలనుంచి ఏడువేల వరకు ఖర్చవుతోంది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరుతో వెనక్కు తీసుకోవడంతో 90శాతంపైగా పంచాయతీల్లో ఖజానా ఖాళీ అయింది. దీంతో ప్రతి పనికి సాధారణ నిధులపైనే ఆధారపడాల్సి వచ్చింది. మైనర్ పంచాయతీల్లో ఇంటి, నీటి పన్నుల ద్వారా సమకూరే ఆదాయం రూ. వేలల్లో ఉంటుంది. వీటితో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, కార్మికుల వేతనాలతోపాటు, సచివాలయాల ఖర్చు కూడా భరించాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

సర్వీస్ చార్జీలు ప్రభుత్వానికే..

సచివాలయాల ద్వారా ప్రస్తుతం 543 రకాలకుపైగా సేవలు అందుతున్నాయి. వాటి ద్వారా సమకూరే నిర్ణీత చార్జీలను సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాల్సిందే. అన్నీ తీసుకుని కనీసం ఇంటర్నెట్ చార్జీలు కూడా చెల్లించట్లేదు. దీంతో ఆదాయంలేని పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అద్దె భవనాల్లో ఉన్నవాటికి నెలనెలా చెల్లింపులు సమస్యగా మారింది. ఆన్‌లైన్ ద్వారా ఏ సేవ అందించాలన్నా ఇంటర్నెట్ సదుపాయం తప్పని సరి. వాటికి సంబంధించిన బిల్లులుకూడా గత వైసీపీ ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

అస్తవ్యస్తం: భాస్కర్, సర్పంచ్, బూరుగుపల్లి



సచివాలయాల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చింది. సర్వీస్ చార్జీల రూపంలో వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. నిర్వహణకు మాత్రం ప్రభుత్వం పైసాకూడా ఇచ్చేదికాదు. దీంతో పంచాయతీ డబ్బులే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిధులివ్వలేదు: అంజినప్ప, ఎంపీడీఓ, కదిరి

సచివాలయాల నిర్వహణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. పంచాయతీలే భరించేవి. సర్వీస్ చార్జీలు, ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సి వచ్చేది.

అప్పుల ఒత్తిడితో రైతు ఆత్మహత్య

నార్పల, జూన్ 28: మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన రైతు చాకలి నాగప్ప(46) అప్పుల ఒత్తిడి భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాగప్పకు 1.30 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంతోపాటు వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.14 లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.9 లక్షలు అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో వారు నోటీసులు జారీ చేశారు. అప్పు ఇచ్చిన ఇతరుల నుంచి సైతం ఒత్తిడి మొదలైంది. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగప్పకు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



చాకలి నాగప్ప(ఫైల్)

అన్నిగ్రూపుల రక్తం నిల్వ ఉండాలి

● బాధితులను రక్తనిధి కేంద్రాలు ఆదుకోవాలి ● రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై సమీక్షలో కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 28: రక్తనిధి కేంద్రాల్లో అన్ని గ్రూపుల రక్తం నిల్వ ఉండాలని, అత్యవసర కేసులు ఎప్పుడు వచ్చినా వారికి రక్తం అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రక్తం కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతి వారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కనీసం 100యూనిట్ల రక్తం సేకరించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వశాఖల ప్రమేయం ఉండేలా చూడాలన్నారు. రెడ్‌క్రాస్‌లో ప్రతి సభ్యుడు మానవత్వంతో పనిచేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్సా కేంద్రాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. రెడ్‌క్రాస్‌కు విరివిగా విరాళాలు అందించి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రక్తదానం చేయడానికి అందరూ ముందుండాలన్నారు. రక్తదానం ప్రయోజనాలను అందరికీ వివరించి, రక్తదానాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడిగా కలెక్టర్ సభ్యత్వం తీసుకున్నారు. ఈసందర్భంగా రక్తదాతల సేవలను కొనియాడుతూ సత్కరించి అభినందించారు. రక్తదానం ఎందరికో ప్రాణదానమని, వైద్యులు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యులు మాజీ ఎంఎల్‌ఏ కాపురామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థజిల్లా ఛైర్ పర్సన్ కాపుభారతి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డ్రగ్స్ కంట్రోల్ డీడీ రమేష్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సెక్రటరీ మోహన్‌క్రిష్ణ పాల్గొన్నారు.



రక్తదాత, కార్డియాలజీ వైద్యుడు సుభాష్ చంద్రబోస్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● పోలీస్ అధికారులకు ఏఎస్పీ విష్ణు సూచన

పుట్టపర్తిరూరల్, జూన్ 28: జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి సిబ్బంది వాటిపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ ఎస్పీ విష్ణు సూచించారు. పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. జూలై 1 వ తేదీ నుంచి నూతనంగా భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం చట్టాలు అమలు కానున్నాయని తెలిపారు. కొత్తచట్టాలు, పాతచట్టాలలో మార్పులు చేర్పులను క్షుణ్ణంగా వివరించి సందేహాలను నివృత్తి చేశారు. కొత్తచట్టాలు అమలు జరిగిన వెంటనే.. అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, అరెస్టు, వాంగ్మూలం, తదితర అంశాలపై పాటించాల్సిన జాగ్రత్తలు, చార్జిషీట్ ఎలా తయారుచేయాలి, కేసుల ట్రయల్ సమయంలో దర్యాప్తు అధికారులు నేరస్తులకు శిక్షలు పడే విధంగా ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై వివరించారు. నూతన చట్టాల ద్వారా కేసుల



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ విష్ణు, పాల్గొన్న సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది

దర్యాప్తు విధానాల్లో, పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుంటుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్తచట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఐటీ కోర్ టీం సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బోగాదమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో బోగాదమ్మ అమ్మవారు

గాండ్లపెంట, జూన్ 28: మండలంలోని తుమ్మల బైలు పంచాయతీ సాదులవాండ్లపల్లిలోని బోగాదమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశామన్నారు. ఆదివారం తెల్లవారుజామున జ్యోతులు, బోనాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ రోజున ఉత్సవాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు.

కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

బత్తలపల్లి, జూన్ 28: మండలంలోని ముష్టూరు గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామని, కోడిపందేలు నిర్వహిస్తున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.26,150 నగదు, 5 కోడి కత్తులు, 6 బైకులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట, మట్కా ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

33వ వార్డులో పారిశుధ్య పనులు


ధర్మవరంలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూన్ 28: పట్టణంలో 33వ వార్డులోని డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుండేది ఉండేది. దీంతో వాటి నుంచి వచ్చే దుర్గంధంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. గమనించిన ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గోసల శ్రీరాములు సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుక్రవారం డ్రైనేజీలను శుభ్రం చేయించారు. గోసల శ్రీరాములుతో పాటు నాయకులు కేతినేని రాజు, నాగేంద్ర తదితరులు మున్సిపల పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రం చేయించారు.

డ్రైనేజీల వద్ద బ్లీచింగ్..

ఓబుళదేవరచెరువు: మండలంలోని గాజుకుంటపల్లిలోని మురుగు కాలువల వద్ద తీవ్ర అపరిశుభ్రత పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులు శుక్రవారం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. బీజేపీ నాయకుడు వీరాంజనేయులు మాట్లాడుతూ స్థానిక పారిశుధ్య, వైద్య సిబ్బంది పట్టించుకోకపోతే తామే బ్లీచింగ్ చల్లించామని తెలిపారు. గంగులప్ప, నరసింహనాయుడు, నాగరాజు, వెంకటప్ప, ఆంజనేయులు, కిష్టప్ప పాల్గొన్నారు.

కోటపల్లి ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

తనకల్లు, జూన్ 28: మండలంలోని కొక్కంటి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కోటపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం జిల్లా టాస్కుఫోర్సు టీమ్ సభ్యులు తనిఖీ చేశారు. కొక్కంటి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్సు సభ్యులు నాగరాజు, సుబ్బారావు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధిక టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, హెల్త్ సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు తరలిరండి

కదిరి అర్బన్, జూన్ 28: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జూలై 8నుంచి మూడురోజుల పాటు కాకినాడలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగుతులు జరగనున్నాయని, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలో శుక్రవారం వారు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు రాజకీయాలపై ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకోవాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజకీయ,సామాజిక, ఆర్థిక పరిస్థితులపై చైనత్యం చేయడానికి ఈశిక్షణ తరగతులు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పవన్, మహేంద్ర, సురేష్, చైతన్య, గణేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ

కొత్తచెరువు, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని ఎంఈఓ జయచంద్ర తెలిపారు. మండలంలోని ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల హెచ్ఎంలకు శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని జడ్పీ బాలుర హైస్కూల్లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యాప్రవేశ్, విద్యార్థి కిట్ల పంపిణీ గురించి వివరించారు. తర్వాత గత ఐదేళ్లలో పాఠశాల ఎన్‌రోల్‌మెంట్‌ను పరిశీలించారు. విద్యార్థులు తగ్గడానికి కారణాలను విశ్లేషించుకుని విద్యార్థుల హాజరు శాతాన్ని ఏవిధంగా పెంచుకోవాలన్న అంశాలను తెలియజేశారు. మధ్యాహ్నభోజనం, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టెస్టుపుస్తకాలు వంటివి సక్రమంగా అందిస్తున్నారా అనే వివరాలపై ఆరాతీశారు. ఇంకా విద్యార్థులు మిగిలి ఉంటే వివరాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు అసిస్టెంట్ అకాడమిక్ మానటరింగ్ అధికారి మహేంద్రరెడ్డి, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ జయచంద్ర

అంతర్జాతీయ క్రీడాపోటీలకు 'యశోద' విద్యార్థులు


విద్యార్థులకు అభినందనలు

ధర్మవరం, జూన్ 28: జూలైలో జరగనున్న అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పట్టణంలోని యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 13, 14 తేదీల్లో తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లాలో జరిగిన నేషనల్ మీట్‌లో తమ పాఠశాలకు చెందిన తన్మయి శ్రీచరణ్, యశ్వంత్‌కుమార్ ప్రతిభ కనబరచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు జూలై 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఆ విద్యార్థులను శుక్రవారం డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జూన్ 28: మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెట్లునాటుదాం కార్యక్రమాన్ని మండలంలోని కంబాలపర్తి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. తర్వాత బీజేపీ నాయకులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంబాలపర్తి సర్పంచు వేమన్న, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడెసె దేవానంద్, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్ర కల్లుగీత కార్మికుల సంఘం కన్వీనర్ హరికృష్ణగౌడ్, నాయకులు కొండమరాజు, జ్యోతిప్రసాద్, సురేంద్ర బాబు, గంగిశెట్టి, విష్ణు, వెంకటశివ పాల్గొన్నారు.

డయేరియాపై విద్యార్థినులకు అవగాహన

ముదిగుబ్బ, జూన్28: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం డయేరియాపై విద్యార్థినులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ కలుషిత తాగునీరు, జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వల్ల డయేరియా సోకుతుందని తెలిపారు. కనుక ప్రతిఒక్కరూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ముఖ్యంగా భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా సోకితే చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. పాఠశాల ఎస్ఓ ఫక్రుబీ, సీహెచ్ఓ స్వర్ణలత, ఆస్పత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై క్రిమినల్ కేసు

చెన్నేకొత్తపల్లి, జూన్ 28: లైంగిక వేధింపుల ఆరోపణలున్న మండలంలోని ఎన్ఎస్‌గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు ఉదయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పలువురు ఏఎన్ఎంలు అతనిపై గురువారం ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆ వైద్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కొత్తచట్టాలొస్తున్నాయి.. జాగ్రత్త

కదిరిలీగల్, జూన్ 28: కొత్త చట్టాలొస్తున్నాయని జాగ్రత్త అని, నేరాలు చేసి తప్పించుకునే వారి ఆటలు ఇక సాగవని మండల న్యాయాధికార సేవా సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో కేసులు పరిశీలన చేయడానికి కొత్త చట్టాలొస్తున్నాయని తెలిపారు. వాటిల్లో ఒకసారి పట్టుబడిన వ్యక్తి డేటా మొత్తం నిక్షిప్తం అవుతుందన్నారు. అదే వ్యక్తి మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలుంటాయన్నారు. అనంతరం జైల్లో భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, దశరథనాయక్, సబ్‌జైల్ అధికారి వాసుదేవరెడ్డి ఉన్నారు.


సబ్‌జైలులో ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి జయలక్ష్మి

శ్మశానం వద్ద స్థల పరిశీలన

ధర్మవరం, జూన్ 28: పట్టణంలోని శ్మశానం వద్ద దినఖర్మలు చేసేందుకుగాను అనువైన స్థలాన్ని మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధసూదన్‌రెడ్డి, శానిటరీఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకుడు బీమనేని ప్రసాద్‌నాయుడు స్థలాన్ని పరిశీలించి చదును చేయించారు. చనిపోయిన వారికి శ్మశాన వాటిక వద్ద దినఖర్మ చేసేందుకు స్థలం సరిగా లేక కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటివారి కోసం స్థలాన్ని పరిశీలించి కేటాయించామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక

తాడిమర్రి, జూన్ 28: మండలకేంద్రంలోని వాసవీమాత ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం సమావేశం జరిగింది. ఇందులో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగాధర్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా కునుకుంట్ల బొజ్జయ్య, కార్యదర్శిగా చిల్లకొండయ్యపల్లి రామకృష్ణ, లీగల్ అడ్వయిజర్‌గా బండారు వెంకటేశ్, సంయుక్తకార్యదర్శిగా నరేశ్‌గుప్తా, కోశాధికారిగా మోహన్, అడ్వయిజర్‌గా శంకరయ్య, సభ్యులుగా సుబ్రమణ్యం,గుండాపుల్లయ్య, నరేంద్ర, సాయిపవన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష తదితరులు పాల్గొన్నారు

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఓబుళదేవరచెరువు, జూన్ 28: మండల వ్యాప్తంగా జూలై 1వ తేదీన సామాజిక పింఛన్లను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వరలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా 14 పంచాతీయతీల్లో 294 క్లస్టర్లలో పంపిణీకి మ్యాపింప్ పూర్తి అయిందన్నారు. 7,856మందికి పింఛన్లు అందించనున్నట్లు చెప్పారు.

నేడు కంటి వైద్యశిబిరం

ఓబుళదేవరచెరువు, జూన్ 28: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం పుట్టపర్తి అల్ట్రావిజన్ ఐకేర్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం జరగనుంది. ఇందులో కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పశువుల పాకగా.. బస్ షెల్టర్

● ఐదేళ్లుగా వాడుకుంటున్న వైసీపీ కార్యకర్త

● ఇబ్బందుల్లో ప్రయాణికులు

గాండ్లపెంట, జూన్ 28: మండలంలోని మల్లమీదపల్లి గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ పశువుల పాకగా మారింది. 12 ఏళ్ల కిందట రూ.లక్షలు వెచ్చించి ఈ బస్ షెల్టర్‌ను నిర్మించారు. ఐదేళ్ల కిందట దానిని ఆ గ్రామానికే చెందిన ఓ వైసీపీ కార్యకర్త పశువులపాకగా మార్చాడు. షెల్టర్ ద్వారానికి ఇనుప గేటు ఏర్పాటు చేసి అందులోకి గొర్రెలు, మేకలు, కోళ్ల తోలుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. మల్లమీదపల్లి నుంచి బనియాన్‌చెరువు, సామచేను బైలు, నల్లచెరువులోని పాతరైల్వేస్టేషన్, కదిరి, మదనపల్లికి నిత్యం అనేక మంది వెళుతుంటారు. తనకల్లు మండలంలోని రాసినేపల్లి, చిన్నపల్లి, బండకాడపల్లి గ్రామాలకు నిత్యం ప్రయాణిస్తుంటారు. వీరి సౌకర్యార్థం గ్రామంలో బస్సుషెల్టర్ ఏర్పాటు చేశారు. ఐదేళ్ల క్రితం వరకు అక్కడ బస్సులు నిలుస్తుండడం వల్ల.. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. అయితే ఐదేళ్ల నుంచి వైసీపీ కార్యకర్త పశువుల పాకగా మార్చి ఏకంగా తాళం వేశాడు. దీంతో అక్కడ బస్సులు నిలబడటం లేదు. చేసేదిలేక ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి బస్‌షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగపడేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్‌కు గేటు వేసిన దృశ్యం

మార్కెట్‌యార్డు భవనం పరిశీలన

నల్లమాడ, జూన్ 28: మండలంలోని అరవవాండ్లపల్లి సమీపంలో నూతనంగా నిర్మించిన మార్కెట్‌యార్డు భవనాన్ని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అధికారులనడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా పనులుంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె

● మండలంలోని రాగానిపల్లికి చెందిన చిట్టిబాల కేశవరెడ్డి (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పల్లె పరామర్శించారు.

పోలవరం నిర్మాణం.. బాబుతోనే సాధ్యం

ఓబుళదేవరచెరువు,: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక అయిన పోలవరం, అమరావతి నిర్మాణాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతమానుపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఇది ప్రజాప్రభుత్వమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం నిరంతరం కృషి చేస్తారన్నారు. ఆయన సారథ్యంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తారని పేర్కొన్నారు. తర్వాత అల్లాపల్లి పంచాయతీలోని పగడాలపల్లి, చౌడంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. టీడీపీ మండలకన్వీనర్ జయచంద్ర, నాయకులు చక్రధర్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీసీ ఉద్యోగ సంఘం నాయకులు

ధర్మవరం, జూన్ 28: బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితను ధర్మవరానికి చెందిన బీసీ ఉద్యోగ సంఘం నాయకులు శుక్రవారం పెనుకొండలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం బీసీ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, బలరాముడు, బీకేముత్యాలప్ప, ఉరుకుందప్ప,మల్లికార్జున, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, చంద్రశేఖర్, బండి శ్రీనివాసులు ఉన్నారు.


మంత్రి సవితతో బీసీ ఉద్యోగ సంఘం నాయకులు

'షాపింగ్ మాల్‌ను మూసివేయాల్సిందే'

ధర్మవరం, జూన్ 28: పట్టణంలో గత ఏడాది ఏర్పాటు చేసిన ఓ షాపింగ్ మాల్‌ను మూసివేయాల్సిందేనని, అంతవరకు పోరాటాలు ఆపమని పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం పట్టణ అధ్యక్షుడు గిర్రాజురవి పేర్కొన్నారు. పట్టణంలోని నేసేపేటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం వల్ల తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. ఆ షాపింగ్‌మాల్ ప్రారంభించే సమయంలో అప్పటి ఎమ్మెల్యే వద్దకు వెళ్లి సమస్యను విన్నవించామని, ఆయన మా మాటను పెడచెవిన పెట్టారని వాపోయారు. జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడి షాపింగ్ మాల్‌ను మూసివేయించేలా చేసి న్యాయం చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం చేనేత కార్మికులు, వ్యాపారులు ఈ షాపింగ్‌మాల్ వల్ల నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో ఆ సంఘం సహాయ కార్యదర్శి కోటం హేమంత్‌కుమార్, డైరెక్టర్లు గాండ్లరామాంజనేయులు, పల్లా నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిర్రాజు రవి

కుల ధ్రువీకరణ పత్రాల విచారణలో జాగ్రత్తలు పాటించాలి

బత్తలపల్లి, జూన్28: కుల ధృవీకరణ పత్రాల విచారణలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ వెంకటశివరామి రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని శుక్రవారం వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ పరిశీలించి మాట్లాడారు. కుల ధ్రువీకరణ పత్రాల విచారణ చేసేటప్పుడు వారి కులము, పుట్టిన తేదీ, కుటుంబ సభ్యుల వివరాలను ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలన్నారు. తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకుని విచారణ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, వీఆర్వోలు భరద్వాజ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


వీఆర్వోలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని వినతి

కదిరిఅర్బన్, జూన్ 28: పట్టణంలోని నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని శుక్రవారం సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పట్టణంలోని ఇళ్ల లేని నిరుపేదలు వికలాంగుల కాలనీకి దగ్గరున్న సర్వేనెంబర్ 83-1లో ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారందరికీ ఆయా స్థలాల్లో ఇళ్ల పట్టాలివ్వాలని అన్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నవారికి పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని కోరారు. స్పందించిన తహీసల్దార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పట్టాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లియాకత్, ఆదినారాయణ, ఖాదర్‌బాషా, ఏఐటీయూసీ నాయకుడు మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

యువతి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 28: మండలంలోని దంచెర్ల గ్రామానికి చెందిన శిరీష(20)అనే యువతి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. బాలసుంకన్న కుమార్తె శిరీష రెండేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోందన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిరీషకు వైద్యం చేయించారన్నారు. గురువారం రాత్రి కడుపునొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అక్రమంగా కలప తరలిస్తున్న లారీ పట్టివేత

పెనుకొండ రూరల్, జూన్ 28: మండల పరిధిలోని షీప్‌ఫారం వద్ద మడకశిర వెళ్లే రహదారిలో అక్రమంగా కలప తరలిస్తున్న లారీని అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. నల్లమాడ మండలం నుంచి సుబాబుల కలపను లారీలో వేసుకుని పెనుకొండ మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. కలపను అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు సమాచారం అందించడంతో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, అటవీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న లారీని నిలుపుదల చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజును వివరణ కోరగా వాల్టా చట్టం ప్రకారం అక్రమంగా కలప రవాణా చేయరాదన్నారు. అనుమతులు ఉంటే వాహనంను విడుదల చేస్తామని లేకుంటే వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు.


పోలీసులు పట్టుకున్న కలపలారీ

టీడీపీ పట్టణ కన్వీనర్‌గా శ్రీరాములు



శ్రీరాములు, రమణమ్మను అభినందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 28 : తెలుగుదేశం పార్టీ పెనుకొండ పట్టణ కన్వీ నర్‌గా శ్రీరాములుయాదవ్‌ను బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఎంపిక చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిం చారు. టీడీపీ పట్టణ కన్వీనర్‌గా శ్రీరాములు యాదవ్ ను, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలిగా మాజీ ఎం పీటీసీ రమణమ్మను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకుడు దాదు, సర్పంచ్ శ్రీనివాసులు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, షౌకత్, తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇండ్ జీనియస్ కో కన్వీనర్‌గా గోరంట్ల విద్యార్థి



గోరంట్ల, జూన్ 28: అఖిలభారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఇండ్ జీనియస్ కో కన్వీనర్‌గా గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి వద్దగల బెస్ట్ యూనివర్సిటీ బీటెక్ ఫైనలియర్ విద్యార్థి గోపీచంద్ నియమితుడైనట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో తిరుపతిలో నాలుగురోజులపాటు రాష్ట్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇండ్ జీనియస్ ఫోరం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి ప్రయోజనాలకోసం పనిచేయడానికి కో కన్వీనర్‌గా గోపీచంద్‌ను నియమించారని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, విద్యార్థులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

అక్రమంగా కలప తరలిస్తున్న లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న కలప లారీ

పెనుకొండ రూరల్, జూన్ 28: మండల పరిధి లోని షీప్‌ఫారం వద్ద మడకశిర వెళ్లే రహదారిలో అక్ర మంగా కలప తరలిస్తున్న లారీని అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. నల్లమాడ మండలం నుంచి సుబాబుల కలపను లారీలో వేసుకుని పెనుకొండ మీదుగా కర్ణాట కకు తరలిస్తున్నారు. కలపను అక్రమంగా తరలిస్తున్నా రని స్థానికులు సమాచారం అందించడంతో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, అటవీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న లారీని ని లుపుదల చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజును వివరణ కోరగా వాల్టా చట్టం ప్రకారం అక్రమంగా కలప రవాణా చేయరాదన్నారు. అనుమ తులు ఉంటే వాహనంను విడుదల చేస్తామని లేకుంటే వాల్టాచట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు.

కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

బత్తలపల్లి, జూన్ 28: మండలంలోని ముష్టూరు గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని శుక్ర వారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశా మని, కోడి పందేలు నిర్వహిస్తున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.26,150 నగదు, 5 కోడి కత్తులు, 6 బైకులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎ క్కడైనా కోడి పందేలు, పేకాట, మట్కా ఆడుతున్నట్లు తె లిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 28: కుటుంబ కలహాల కారణంగా వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గోరంట్ల పట్టణంలోని ఆర్కే థి యేటర్ వీధిలో ఉంటున్న ఆంజనేయులు భార్య అనిత గురువారం రాత్రి అధిక మోతాదులో మాత్రలు మింగి అస్వస్థతకు గురైంది. కటుంబకలహాతో మనస్తా పం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆమె అస్వస్థతకు గురయ్యారు. అలాగే పుట్టపర్తి మండలం పెడబల్లి తండాకు చెందిన గిరినాయక్ భార్య ప్రియాంక బాయి కటుంబకలహాల నేపథ్యంలో విషపుగుళికలు తిని అస్వస్థతకు గురైంది. వారిరువుని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనాల్లో హిందూపురం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



లక్ష్మీకాంతప్ప (ఫైల్)

మడకశిర రూరల్, జూన్ 28: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామ సమీపంలో మడకశిర-హిం దూపురం ప్రధాన రహ దారిపై శుక్రవారం ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందు లో తీవ్ర గాయాలైన లక్ష్మీ కాంతప్ప(48) బెంగళూ రుకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. స్థానికులు అందించిన వివరాల మేరకు... మండలంలోని టీ రాయాపురానికి చెందిన లక్ష్మీకాంతప్ప, సన్నమ్మ దంపతులు ద్విచక్రవాహనంలో కుటుంబసభ్యుల కోసం పొలంవద్దకు భోజనం తీసుకెళ్తున్నారు. బుళ్ళసముద్రం వద్ద ప్రధాన ర హదారిలో ఆటోను తప్పించి ముందుకెళుతున్న సమ యంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం వచ్చి ఢీకొంది. దీంతో లక్ష్మీకాంతప్ప, సన్నమ్మ రోడ్డుపై పడి తీవ్రగా యాలయ్యాయి. వారిని వెంటనే 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలిస్తుతుండగా మార్గమధ్యమంలో లక్ష్మీకాంతప్ప మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలికల కళాశాలలో మంత్రి తనిఖీ

మరుగుదొడ్ల నిర్వహణపై ఆగ్రహం



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత



విద్యార్థినులతో మాట్లాడుతన్న మంత్రి

పెనుకొండ, జూన్ 28 : పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలను బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి శుక్రవారం కళాశాలను తనిఖీచేసి, వంటశాలకు వెళ్లి భోజనం నాణ్యతను పరిశీలిం చారు. అనంతరం తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ అధ్యాపకులు సక్రమంగా తరగతులకు వస్తున్నారా, పాఠాలు సక్రమంగా చెబుతున్నారా, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా... తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్లు పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటంతో స్వీపర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లలో కూడా ఇలాగే ఉంచుకుంటారా అని మండిపడ్డారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా ఆప్కో పరిశ్రమ బాగాలేదన్నారు. చేనేత పరిశ్రమ బా గుంటేనే ఆప్కో రంగం బాగుంటుందన్నారు. ఆ ప్కో దుకాణాలను మరిన్ని తెరిపిస్తామ న్నారు. చేనేత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఆ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కళాశాల సిబ్బందిని మంత్రి హెచ్చరించారు.

స్థానికంగా ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



బెంగళూరులో గార్మెంట్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 28: అన్ని విధాలా వెనకబడిన మడకశిర నియోజకవర్గం అభివృద్ధి పరిశ్రమల స్థాపనతోనే సాధ్యమని, తద్వారా స్థానికంగా మూడు వేల మందికి ఉపాధి కల్పిం చడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు ఎమ్మె ల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. వారు శుక్రవారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఇండియన్ డిజైన్‌గా ర్మెంట్ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమ య్యారు. నగర పంచాయతీ పరిధి లోని చీప లేటి సమీపంలో ఇప్పటికే ఇండియన్ డిజైన్ గా ర్మెంట్ పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తిచేశారు. గత ప్రభుత్వంలో పరిశ్రమ నిర్వాహకు లకు కొన్ని అడ్డంకులు సృష్టించడం వల్ల ప్రారంభంకాలేదు. టీడీపీ కూటమి అధి కారంలోకి రాగానే నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు పలవురు ముందుకొ స్తున్నారు. ఇందులో భాగంగానే బెంగళూరులో ఉన్న ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పరిశీలించి అధినేత జావిద్, సల్మాన్‌తో సమావేశమయ్యారు. నిర్మాణం పూర్తైన గార్మెంట్ పరిశ్రమను ప్రారం భించాలని, ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అందుకు వారు సానుకూ లంగా స్పందించి త్వరలో గార్మెంట్ పరిశ్రమను ప్రారంభించి మూడు వేల మందికి ప్రత్యక్షంగా, మరికొంత మందికి పరోక్షంగా ఉపాధి కల్పించేం దుకు సిద్ధంగా ఉన్నామని వారు హామీ ఇచ్చినట్లు టీడీపీ స్థానిక నాయ కులు తెలిపారు. అనంతరం టెక్స్‌పోర్ట్ ఓవర్‌సిస్ సంస్థ కంపెనీ సీఈఓ అమి త్ రాయ్, ఎండీ సోమశేఖర్‌ను కలిశారు. రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు టెక్స్‌టైల్ పరిశ్రమలో ఉపాధి అవకా శాలు కల్పించాలని కోరగా, అందుకు వారు సైతం సానుకూలంగా స్పందిం చినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు మహేష్, రామకృష్ణ ఉన్నారు.

నిధులు స్వాహా చేశారని ఫిర్యాదు

గోరంట్ల, జూన్ 28: మండలంలోని వానవోలు ఎస్సీకాలనీలో కమ్యూ నిటీ భవనం కోసం మంజూరైన రూ.1.73లక్ష నిధులను పంచాయతీ కార్యద ర్శి, సర్పంచ్ స్వాహా చేశారని భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఆరోపించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వానవోలు ఎస్సీ కాలనీలో కమ్యూ నిటీ భవనం నిర్మాణానికి 2021లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ. 7లక్షలు, ఎంపీ నిధుల ద్వారా రూ.3లక్షలు కేటాయించారని తెలిపారు. ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ భవన నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. కమిటీ పునాదుల వరకు నిర్మాణం పూర్తి చేసింది. అయితే పంచాయతీ పాలక వర్గం అభ్యంతరాలు తెలుపుతూ తమపై పోలీసులకు ఫిర్యాదు చేసి, ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. దీంతో పనులు ఆగిపోగా, మంజూరైన రూ. 3లక్షల ఎంపీ నిధులు మురిగిపో యాయన్నారు. అలాగే పునాది నిర్మాణానికి సంబంధించి రూ.1.73లక్షలు మంజూరుకాగా, కమిటీ సభ్యులకు తెలియకుండానే సర్పంచ్, కార్యదర్శి కాజేశారని ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యదర్శిని విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారన్నారు. దీనిపై వానవోలు పంచాయతీ కార్యదర్శి బాజ్‌జాన్‌ను వివరణ కోరగా.. తాను ఆ సమయంలో లేనని తరువాత నియమితులైనట్లు చెప్పారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

పోలీసు యంత్రాంగం ఏం చేస్తోంది?: కాంగ్రెస్ నేతలు



సంపత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హిందూపురం, జూన్ 28 : యువ న్యాయవాది, ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమా ర్‌ను హత్యచేసిన నిందితు లను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విభాగాల జాతీయ సమన్వయకర్త కొప్పల రాజు డిమాండ్ చేశారు. ఆయన శుక్ర వారం హిందూపురానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల దారుణహత్యకు గురైన సంపత్‌కుమార్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... విద్యార్థి విభాగంలో పట్టణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి వెళ్లిన సంపత్ దారుణహత్య తమను కలిచివేసిందన్నారు. హత్యచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు కానీ, దోషులను అరెస్ట్ చేయడంలో పోలీ సులు నిర్లక్ష్యం కనబడుతోం దన్నారు. ఈ హత్యకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రత్యేకంగా ఒక న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ అండగా ఉంటుందని న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కేటీ శ్రీధర్, సుధాకర్, శ్యామ్, హనుమంతు, కలీం తదిత రులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీకి గుండుమల పరామర్శ

రొళ్ల, జూన్ 28: మండలంలోని మాజీ ఎంపీటీసీ చంద్రప్ప అనారోగ్యంతో బెంగళూరు నిమాన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అక్కడికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకొన్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. మండల కన్వీనర్ దాసిరెడ్డి, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

●తహసీల్దార్

హిందూపురం అర్బన్, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ప్రభుత్వ హాస్టల్ విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ గంగప్ప సూచించారు. విద్యార్థు లకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, లే ని పక్షంలో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించడంతో మండల పరిధిలోని పూలకుంట జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం తహసీల్దార్, ఎంఈఓలు ఆకస్మికంగా తనికీ చేశారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. పిల్లలకు కోడిగుడ్లు, చిక్కీలు అందించక పోవడంతో వెంటనే ఏజెన్సీ నిర్వాహకుడికి ఫోన్ చేశారు. కోడిగుడ్లు, చెక్కీలకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, అవి వచ్చాక సరఫరా చేస్తామని నిర్వాహకుడు చెప్పినట్లు సమాచారం. అదే విధంగా అధికారులు శుక్రవారం రాత్రి పట్టణ పరిధిలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు అన్ని విధాలా సహకరిస్తుందని చక్కగా చదువుకుని ఉన్నత స్థానం చేరుకోవాలని సూచించారు.

మహిళా సంఘాల బలోపేతానికి పనిచేద్దాం : ఏసీఓ

అగళి, జూన్ 28 : మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఐకేపీ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు సిబ్బంది, ఉద్యోగులకు సూచించారు. అయితే రాష్ట్రంలో అధికా రంలో ఉన్న ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలో శుక్రవారం త్రివేణి మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, యానిమేటర్లు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ... ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. మండలంలో 932మహిళా సంఘాలుండగా అందులో 9320మంది సభ్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాలను వారికి తెలియజేయాల న్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ ఉమేష్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏపీఎంలు సురేష్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతోనే చిన్నారుల అభివృద్ధి : సీడీపీఓ



కొడికొండ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు, జూన్ 28: చిన్నారులకు మానసిక, శారీరక దృఢత్వానికి అంగన్‌వాడీ కేంద్రాలు కృషి చేస్తున్నాయని ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. మండలపరిధిలోని కొడికొండ అగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్ల పూర్తి చేసుకున్న చిన్నారులకు శుక్రవారం ఘనంగా గ్యాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సం దర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల చిన్నారులను సక్రమంగా అంగన్ వాడీ కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. గ్రాడ్యుయేషన్ పిల్లలకు స్వీట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధ, బీసీఓ వరుణ్‌కుమార్, కొడికొండ సెక్టార్ కార్యకర్తలు శోభారాణి తదితరలు ఉన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

● కంకరతేలి.. గుంతల మయం
● తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ యథాస్థితి
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పాలిటెక్నిక్ సమీపంలో గుంతలమయమైన ప్రధాన రహదారి

మడకశిర, జూన్ 28: గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు తా త్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే అవి దెబ్బతిని రోడ్లు గుంతలమయం అవుతు న్నాయి. రెండు సంవత్సరాల క్రితం కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో పలుచోట్ల కల్వర్టులు, రోడ్లు దెబ్బతిన్నాయి. అవి నేటికీ మరమ్మ తులకు నోచుకోలేదు. దీంతో ద్విచక్రవాహనదారులు, ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్లు మరింత దెబ్బతిని గుంతల మయం అవుతున్నాయి. మడకశిర మండలంలోని వైబీ హళ్లి రోడ్డుకు గొల్లపల్లి సమీపంలో ఇరువైపులా వేసిన మట్టికొట్టుకుని పోయింది. రోడ్డు పై కంకరతేలింది. ఆ రోడ్డులో ఉన్న కల్వర్టు మధ్యలో గుంత మాదిరి ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ మండ లంలోని అట్లల ఫ్యాక్టరీ సమీపంలోని రోడ్డుపై గతంలో కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాటిని పూడ్చినా, ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు దెబ్బతిని మళ్లీ గుంతల మయమైంది. మధుగిరి రోడ్డు పాలి టెక్నిక్ కళాశాల వరకు పలుచోట్ల గుంతలు పడి కంకర తేలింది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుడిబండ మండలంలోని రొళ్ల - గుడిబండ రోడ్డులో కల్వర్టు దెబ్బతింది. అగళి మండలంలోని ప్రధాన రహ దారిలో ఇరిగేపల్లి వద్ద రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు తెగిపోయింది. నేటికీ మరమ్మ తులు చేపట్టలేదు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించే చాలా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రొళ్ల మండలంలోని సీసీగిరి-మల్లినమడుగు, అగ్రహారం-రొళ్ల, రొళ్ల-దొడ్డేరి, ఎం రాయాపురం-జీరిగేపల్లి రోడ్లు కంకరతేలి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అగళి మండలం ఇరిగేపల్లి వద్ద తెగిన వంతెన



అట్టల ఫ్యాక్టరీ సమీపంలో దెబ్బతిన్న వైబీ హళ్లి రోడ్డు

అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకండి

కలిసికట్టుగా మునిసిపాలిటీని అభివృద్ధి చేద్దాం: మంత్రి సవిత



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ, జూన్ 28 : రాజకీయాలను అభివృద్ధితో ముడి పెట్టకుండా అందరం కలిసి మునిసిపాలిటీని ఆదర్శంగా అభి వృద్ధి పథంలో నడుపుదామని బీసీ సంక్షేమం, జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆమె శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యురాలిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, పార్టీలతో పనిలేకుండా కలిసికట్టుగా పెనుకొండను ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా, వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నగర పంచాయతీలో ప్రధాన వీధులతోపాటు అనేక వీధుల్లో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, మురుగు కాలువలు సక్రమంగా లేక నీళ్లన్నీ రోడ్లపై ప్రవహించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎజెండాలో పొందుపరిచిన అనేక అంశాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వైస్ చైర్మన్ సునీల్‌కుమార్, నందినిరెడ్డి, దస్తగిరి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

●మంత్రికి ఎంఈఓల వినతి

పెనుకొండ, జూన్ 28 : గత ప్రభుత్వంలో జాబ్‌కార్డు విషయంలో తమకు అన్యాయం జరిగిందని, మీరైనా న్యాయం చేయాలంటూ మండల విద్యాశాఖాధికారులు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వారు శుక్రవారం మంత్రిని కలిసిన 15మండలా లకు చెందిన ఎంఈఓలు వినతిపత్రం అందించారు. ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించి పూలమాలలువేసి శాలువలుకప్పి సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాడి రైతులను ఆదుకోవాలని వినతి

హిందూపురం(సోమందేపల్లి), జూన్ 28: పాడి రైతులను ఆదుకోవాలంటూ సోమందేపల్లి మండలంలోని పాడి రైతులు శుక్రవారం బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రాన్ని అం దించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు హ రి మాట్లాడుతూ... పలు పాల డెయిరీ కంపెనీలు పాలధరలు తగ్గించి పా డిరైతులను మోసం చేస్తున్నాయన్నారు. పాల ఉత్పత్తులను పూర్తిస్థాయిలో విక్రయించుకోలేని దుస్థితి పాడి రైతులకు దాపురించిందన్నారు. పాడి రైతు లు డెయిరీలకు తెచ్చే పాలకు గిట్టుబాటు ధర లభించ డంలేదన్నారు. తగు చర్యలు తీసుకోలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మడకశిర నాయకులు



రొళ్ల, జూన్28: విజయ వాడలోని తెలుగుదేశం పా ర్టీ కేంద్ర కార్యాలయంలో శుక్ర వారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను శుక్రవారం మడకశిర నాయ కులు కలిశారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిట్లు రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ తెలిపారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి సన్నాహాలు

గోరంట్ల, జూన్ 28: సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయడానికి మండల పరిషత్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఈఓఆర్డీ సుధాకర్ శుక్రవారం సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో గతనెల 11,591 మందికిగాను రూ.3,44,85,500 పంపిణీ చేయగా, జూలై నెలకు సంబంధించి 11,579మందికి రూ.7,89,46,500 మం జూరైనట్లు అధికారులు తెలిపారు. జూలై నెలకు సంబంధించి రూ.నాలుగు వేలతో పాటు అదనంగా రూ. మూడువేలు కలిసి ప్రభుత్వం చెల్లిస్తోందని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు 162మంది ద్వారా కార్యదర్శులు క్లస్టర్ల వారీగా లబ్ధిదారుల ఇళ్లవద్దనే జూలై 1వతేదీ ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే మండల వ్యాప్తంగా డయేరియా వ్యాధి తీవ్రత వలన అధికంగా ఉన్నట్లు తెలిపారు. పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

సీఎం చిత్రపటాల పంపిణీ

హిందూపురం, జూన్ 28: టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పరిగి మండలపరిధిలోని యర్రగుంట గ్రామం సచివాలయానికి .బీఆర్ అంబేద్కర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చిత్రపటాలను అందజే శారు. వాటిని పంచాయతీ కార్యదర్శి అరుణకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విట్టాపల్లి సర్పంచ్ నాగరాజు, నరసింహమూర్తి, శివ, నాగభూషణం, నాగరాజు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిరుపేదల గుడిసెలు



గుడిసెలు వేసిన స్థలంలో నిరుపేదలు, సీపీఐ నాయకులు

లేపాక్షి, జూన్ 28 : మండలకేంద్రం సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్లులేని స్థానిక నిరు పేదలు సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకు న్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదినారాయణరెడ్డి కాలనీ అని నామ కరణం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కన్వీనర్ శివప్ప మాట్లాడు తూ... లేపాక్షి గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో 40మంది నిరుపే దలు గుడిసెలు వేసుకున్నారన్నారు. వారికి పట్టాలు ఇచ్చేంతవరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఖాళీ చేయబోమని పట్టాలు ఇచ్చేవరకు పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, నిరు పేదలు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో పెనుకొండ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

పెనుకొండ, జూన్ 28: ఉత్తరప్రదేశ్ మీరట్ అబాకస్ అకాడమీ నిర్వహించిన ఇంటర్నేషనల్ అబాకస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శాంతినికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న 11మంది విద్యార్థుల్లో ఎనిమిదో తరగతికి చెందిన జ్యోత్స్న ప్రియ, ఐదో తరగతి విద్యార్థులు ధీరజ్, శ్రీనందన్ అవార్డులు సా ధించారని తెలిపారు. ఆ విద్యార్థులకు శుక్రవారం అవార్డులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ, అబాకస్ ఉపాధ్యాయురాలు రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.